క్లుప్తంగా

పోరాటాలకు తగిన ఫలితం దక్కింది

కమలాపురం : తాము చేసిన సుదీర్ఘ పోరాటాలకు తగిన ఫలితం దక్కిందని ఏపీ ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరోగ్య మాదిగ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. దాదాపు 30 ఏళ్ల పాటు మాదిగలు చేసిన పోరాటాలకు తగిన ఫలితం దక్కిందన్నారు. వెనుక బడిన మాదిగ కులానికి రిజర్వేషన్ ఫలాలు అనుభవించే అవకాశం ఇన్నాళ్లకు దక్కిందన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



చెన్నకేశవరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : మండల వైస్ ఎంపీపీ చెన్నకేశవ రెడ్డిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. చెన్నకేశవరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై హైద్రాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రవీంద్రనాథ్‌రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంగాధర్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, శివ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : మండలంలోని 33 కేవీ పార్నపల్లె ఫీడర్ పరిధిలో లైన్లకు తగులుతున్న చెట్లను కొట్టివేస్తుండటంతో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బాలసంజీవులు తెలిపారు. అదేవిధంగా 33 కేవీ బోనాల ఫీడర్ పరిధిలోనూ, బోనాల సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ కారణంగా బోనాల, అంకెవానిపల్లె, కామసముద్రం, కమ్మవారిపల్లె, రామాపురం గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని లింగాల ఏఈ రమేష్‌బాబు తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

దోమల నివారణకు చర్యలు



సొసైటీ కాలనీలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

జమ్మలమడుగు రూరల్ : కన్నెలూరు గ్రామంలోని సొసైటీకాలనీలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. శుక్రవారం పలువీధుల్లో మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టినట్లు కమిషనర్ ప్రమోద్‌కుమారు తెలిపారు.

పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాకమిటీ ఎన్నిలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని మండల విద్యాధికారి శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విద్యాకమిటీ ఎన్నికలకు సంబధించి మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 5వ తేదీన పాఠశాలలో ఓటర్ల జాబితాను పాఠశాల ఆవరణలో అందుబాటులో ఉంచుతామన్నారు. 8వ తేదీన ఎన్నికలకు సంబంధించి సభ్యులను ఫైనలైజ్ చేసి వారిలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నిక చేసి కమిటీని పూర్తిస్థాయిలో ఎన్నుకోబడుతుందన్నారు. అదే రోజు మొదటి స్కూల్ కమిటీ సమావేశం ఉంటుందన్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు సూచనలు అందిచామన్నారు. ఈ కమిటీ ఎన్నికలలో పాల్గొనదలచిన తల్లిదండ్రులు వారి పిల్లలు ఆ పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు.


స్టీల్ ప్లాంట్ సాధించుకుందాం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఉద్యమించి స్టీల్ ప్లాంట్ సాధించుకుందామని స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కన్వీనర్ ఖలందర్ పిలుపునిచ్చారు. స్థానిక జిన్నా రోడ్డులోని ఎంపీజే కార్యాలయంలో శుక్రవారం 'కడప కల్పవృక్షం స్టీల్ ప్లాంట్ సాధించుకుందామా? వదులుకుందామా?' అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు ఈ కరపత్రాన్ని అందించి అందరిని కలుపుకొని ముందుకు పోతామన్నారు. స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరం కో కన్వీర్ సలీం మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ యునైటెడ్ ఫోరంకు తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు మన ప్రజా సేవా సమితి అధ్యక్షుడు అయూబ్ ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఎస్ఐఓ నాయకుడు అదిల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

● మారిన ప్రభుత్వంతో లబ్ధిదారుల్లో ఆందోళన



మధ్యలోనే ఆగిపోయిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు

జమ్మలమడుగు : ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు ఇంటిని నిర్మించుకోవటానికి అప్పటి జగనన్న ప్రభుత్వం లబ్ధిదారులకు ఇల్ల స్థలాలను మంజూరు చేసింది. మండల పరిధిలోని అంబవరం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో సెంటున్నర స్థలంలో ఇళ్లు నిర్మించుకునేవిధంగా లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు గత మూడు సంవత్సరాల నుంచి ఇంటి నిర్మాణాలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం మూడువేల మందికిపైగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అప్పటి ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం లక్షా 80 వేల రూపాయాలు లబిదారులకు హౌసింగ్ కింద మంజూరు చేశారు. ప్రస్తుతం అంబవరం సమీపంలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటివరకు 614 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే జగనన్న కాలనీలో గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారులలో ఆందోళన మొదలైంది. ఇంటి నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు వస్తాయా రావా అన్న ఆలోచనలో పడ్డారు. దీంతో లబ్ధిదారులు పనులను పూర్తి స్థాయిలో నిలిపివేశారు.

పునాది వరకు వేశాము..



అంబవరం వద్ద తమకు సెంటున్నర భూమి ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం హౌసింగ్ ద్వారా రుణాన్ని మంజూరు చేశారు. అయితే పునాది వరకు ఇంటి నిర్మాణం చేపట్టాము. తాము ఇంటి నిర్మాణాలు చేపడితే బిల్లులు వస్తాయో లేదో అని ఇంటి నిర్మాణం పూర్తిగా నిలిపివేశాము.

–షహజాద్ బేగం, కన్నెలూరు, జమ్మలమడుగు

డిసెంబర్ వరకు బిల్లులు చెల్లిస్తాము



అంబవరం జగనన్న కాలనీలో 2,173 ఇళ్లను మంజూరు చేశాము. ఇప్పటి వరకు 600 కుపైగా నిర్మాణాలు పూర్తి చేశారు. చాలా మంది నిర్మాణాలను ఆపేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు వస్తాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరక ఈ ఏడాది డిసెంబర్ వరకు బిల్లులు పడుతాయి.

– ఓబులేసు, హౌసింగ్‌ఏఈ జమ్మలమడుగు

ఘనంగా బళ్లారి రాఘవ జయంతి



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీన్, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందులలోని ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం ఎస్ బేగ్ ఆధ్వర్యంలో శుక్రవారం బళ్లారి రాఘవ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బళ్లారి జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. బళ్లారి రాఘవ తన సమయాన్ని, సంపదను నాటరంగ పురోగతికి హెచ్చించిన త్యాగధనుడు, కళ సమాజంలో మార్పు కోసం ఉపయోగపడాలని అనుకునేవాడన్నారు. రాఘవగారి సేవలకు గుర్తుగా ఆయన పేరుతో స్టాంపును విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ యాక్టివిటీ అధికారిణి డాక్టర్ నివేదిత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు చౌడేశ్వరీ మాత జయంతి వేడుకలు

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం చౌడేశ్వరీ మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 108 కళశాల జలంతో సుహాసినీలు అమ్మవారికి మహా మంగళ స్నానం నిర్వహిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఉదయం 9 గంటలకు గ్రామంలోని నడి వీధి గంగమ్మ వద్ద నుంచి చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చి బోనాల సమర్పణ జరుగుతుంది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు దీపాలంకరణ సేవ ఉంటుంది. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పంట నష్టపరిహారం వర్తింపజేయండి



టి.చదిపిరాళ్ల వద్ద ఎండిన మినుము పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : ఖరీఫ్ సీజన్‌లో వర్షా భావ కారణాలతో మినుము, వరి తదితర పంటలు ఎండిపోయాయని, ఇ–క్రాప్ బుకింగ్ చేపట్టి రైతులకు నష్ట పరిహారం వర్తింపజేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం జేడీఏ నాగేశ్వరరావుతో కలసి మండలంలోని టి.చదిపిరాళ్ల వద్ద ఎండిపోతున్న మినుము పంటను ఎమ్మెల్యే పరిశీలించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 5600 ఎకరాల్లో మినుము పంట వేశారని, అలాగే ఇతర పంటలను కూడా పరిశీలించి ఇ–క్రాప్ బుకింగ్ చేసి నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించేందుకు కృషి చేయాలని ఆయన జేడీఏకు సూచించారు. అలాగే పుట్లంపల్లె, సంబటూరులో ఎండిపోతున్న వరి పంటను పరిశీలించారు. వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, వ్యవసాయ అధికారులు, నాయకలు పాల్గొన్నారు.

మూగజీవాల అక్రమ రవాణా



అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న లారీ

ఎర్రగుంట్ల : ఆవులు, ఎద్దులు, గేదెలను అక్రమంగా మైదుకూరు నుంచి తమిళనాడుకు శుక్రవారం రాత్రి తరలిస్తున్న లారీని విశ్వహిందూ పరిషత్ వారు అడ్డుకున్నారు. వీటిని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. దీనిపై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం నరాల, గుండెజబ్బుల వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చట్టం చేయాలి



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మైలవరం : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి పార్లమెంట్‌లో చట్టం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నాగరాజు మాదిగ కోరారు. ఎస్సీ వర్గీకరణకు అనకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో శుక్రవారం వేపరాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాగన్న, శంకర్, చంద్ర, కార్తీక్, ఓబయ్య, గురుబాబు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్ల నియామకం

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల తహసీల్దార్‌గా ఆర్.జీవన్ చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రకాష్‌బాబు కర్నూలుకు బదిలీపై వెళ్లారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : సింహాద్రిపురం తహసీల్దార్‌గా బి.గుర్రప్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాల జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు డిటీ శిరీష, ఆర్ఐ షేక్షాలు స్వాగతం పలికారు. సీనియర్ అసిస్టెంట్ మహేశ్వర రెడ్డి, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నూతన తహసీల్దార్‌గా పి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కార్యాలయ సిబ్బందితో కలసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్యాలయ పనుల మీద వచ్చే ప్రజలకు కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా పనులు చేయాలని అధికారులకు సూచించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక తహసీల్దార్‌గా శోభన్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ అనంతపురంకు బదిలీపై వెళ్లారు. కొండాపురం తహసీల్దార్‌గా పనిచేసిన శోభన్‌బాబును ఎర్రగుంట్ల తాహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు.

రేపు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉమ్మడి కడప జిల్లా బాల్‌బాడ్మింటన్ జట్టు ఎంపికలు వైఎస్సార్ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం దువ్వూరులోని క్రిస్టియన్ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, వెంకట రమణ తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2009 జనవరి 2, జూనియర్ విభాగంలో పాల్గొనే 2005 జనవరి 2 తరువాత పుట్టిన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9490181104, 7036907303ను సంప్రదించాలని కోరారు.

రేషన్ షాపు వద్ద పడిగాపులు



రేషన్ దుకాణం వద్ద వేచి ఉన్న ప్రజలు

పులివెందుల రూరల్ : రేషన్‌షాపుల వద్ద పట్టణ ప్రజలు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ అందించేవారు. కానీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కోసం 2, 3 కిలో మీటర్లు వెళ్లి గంటల తరబడి వేచి ఉండి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మాదిరిగానే ఎండీయూ ఆపరేటర్ ద్వారా ప్రత్యేక వాహనంలో ఇంటి వద్దకే అందించాలని ప్రజలు కోరుతున్నారు. కొంత మంది ఎండీయూ ఆపరేటర్లను తొలగించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

ఎర్రగుంట్ల : పట్టణంలో వెలసిన గ్రామ దేవతలకు నడివూరుకు చెందిన పెద్దలు, మహిళలు చీరసారే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడివూరు శ్రీపెద్దమ్మతల్లికి చీరసారేను సమర్పించారు. అనంతరం శ్రీ ఏరువాక గంగమ్మతల్లికి చీరసారే కార్యక్రమాన్ని సమర్పించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలకంరించారు. వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



నడివురులో పెద్దమ్మతల్లికి చీరసారే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఇంటింటి సర్వే పరిశీలన



వల్లూరులో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కుష్టు నివారణాధికారి రవిబాబు

వల్లూరు : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలణా కార్యక్రమంలో భాగంగా వల్లూరులో జరుగుతున్న ఇంటింటి సర్వేను జిల్లా కుష్టు, ఎయిడ్స్ మరియు క్షయ నివారణాధికారి డాక్టర్ రవిబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి లక్షణాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రజలు స్పర్శ లేని పొడలు కనిపించినపుడు ఆరోగ్య కార్యకర్తలకు తప్పని సరిగా చూపించాలన్నారు. ఒక వేళ కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే స్థానిక వైద్యాధికారులను సంప్రదించి మందులను ఉచితంగా పొందాలని సూచించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద పొడలు వున్న వారిని పరిశీలించి తగిన సలహాలు, సూచనలు అందించారు. స్థాని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పిజియో థెరపిస్టు మనోహర్, పీహెచ్‌సీ వైద్యులు ప్రసన్నలక్ష్మి, సీహెచ్‌వో వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, మమత, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి రమేష్

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామంలో మొక్కజొన్న పంటను మండల వ్యవసాయ అధికారి రమేష్ రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ప్రధాన సమస్యగా ఉందన్నారు. దీని నివారణకు మొదటగా రైతులు లోతు దుక్కులు చేయడం వల్ల ఉధృతి తగ్గించుకోవచ్చు. అలాగే 4 లింగాకర్షక బుట్టలు అమర్చాలని, విత్తనశుద్ధి సాయంత్రీనిలిప్రోల్ లేదా తాయోమితకాజం 6 ఎంఎల్ ఒక కిలో విత్తనానికి కలిపి చేసుకోవడం వల్ల పంటను 15–21 రోజులు కాపాడుకోవచ్చన్నారు. అలాగే కత్తెర పురుగు ఉధృత్తి ఎక్కువ గమనించినట్‌లెత్తై ఇమ్మమేక్టిన్ బెంజోయెట్ 0.4 గ్రాములు లేదా క్లోరాంత్రీనిలిప్రోల్ 0.4 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్యక్రమంలో ఇప్పట్ల రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జి హరిశిల్ప, రైతులు పాల్గొన్నారు.

గంటలోపు ముర్రుపాలు తాపించాలి



పెద్దచెప్పలిలో ర్యాలీ చేస్తున్న హెల్త్, ఐసీడీఎస్ సిబ్బంది



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రు పాలు తాపించాలని పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జ్ఞానప్రసూన తెలిపారు. శుక్రవారం పెద్దచెప్పలిలో ఆమె తల్లిపాల వారోత్సవాల ర్యాలీని నిర్వహించి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు తాపించాలన్నారు. అవి బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని అందిస్తుందన్నారు. అలాగే తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ తదితర రోగాలు రాకుండా ఉంటాయన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. అనంతరం అనుబంధ పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ కుమారి, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష

తొండూరు : తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని తొండూరు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. మండల పరిధిలోని అగడూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శక్తివంతమైన రక్షణ కవచాన్ని అందించడానికి, పిల్లలలో మెదడు అభివృద్ధిని పెంచడానికి తల్లిపాలు అవసరమన్నారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్ హెల్త్ ఆఫీసర్ నందీశ్వరరెడ్డి, ఏఎన్ఎం లక్ష్మిదేవి, అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దృష్టిలోపం లేని విద్యావంతులు కావాలి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రతి పాఠశాలలోని విద్యార్థులు దృష్టిలోపం లేని విద్యావంతులు కావాలని హెచ్ఎం మార్తమ్మ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి చూపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పౌష్టికాహార లోపం లేకుండా విద్యార్థులు తమ కంటిచూపును కాపాడుకోవాలన్నారు. నేత్రాధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అందుకోవాలంటే కంటిచూపు ప్రధానమన్నారు. కావున తలనొప్పి, కంటి నుంచి నీరు కారడం, చూపు సరిగా కనిపించకపోవడం లాంటి సమస్యలుంటే కంటి వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ అంధత్వ నివారణ సంస్థచే నిర్వహిస్తున్న కంటి పరీక్షలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షలలో దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఏఎన్ఎం శైలజ, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు ఘన నివాళులర్పించారు. ఆయన జయంతి సందర్భంగా ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు. దాదాపు అర్థశతాబ్దం పాటు మహాత్మాగాంధీతో స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాల్గొన్నారన్నారు. దేశభక్తి, పత్తిలో మేలైన వంగడాల సృష్టి, వజ్రాల తవ్వకాలు, వాటి నాణ్యతపై వివిధ పరిశోధనలు చేశారన్నారు. ప్రతి విద్యార్థి జాతిపట్ల, దేశంపట్ల గౌరవం పెంపొందించుకోవాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, ఆర్థిక అధికారిణి కోటేశ్వరి, అకాడమిక్ డీన్ రత్నకుమారి, సీఈఓ రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మధుసూదన్, పీఆర్ఓ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు నీళ్లు విడుదల

దువ్వూరు : రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కెనాల్‌కు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సాగు నీటిని విడుదల చేశారు. ఆయన పూజలు చేసి కృష్ణా జలాలకు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్‌కు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. రాజోలి ఆనకట్ట కింద జిల్లాలో 92వేల ఎకరాలు ఆయకట్టు విస్తీర్ణం ఉందని తెలిపారు. రాజోలి ఆనకట్ట నిర్మాణం పూర్తయితే కేసీ కెనాల్ కింద ఉన్న ఆయకట్టుకు రెండు పంటలకు నీరు అందుతుందని తెలిపారు. ఈ ఐదేళ్లలో రాజోలి జలాశయాన్ని పూర్తి చేసి రైతుల ఆశలను నిజం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.